క్లుప్తంగా

బాక్సింగ్‌లో హనోక్‌కు బంగారు పతకం



గుంటూరు రూరల్: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని గుంటూరు ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు తెలిపారు. కళాశాలలో పాలిటెక్నిక్ మొదటి సంవత్సరం విద్యార్థి కూచిపూడి హనోక్ విజయవాడ లయోలా కళాశాలలో ఇటీవల జరిగిన జిల్లా స్థాయి ఎస్‌జీఎఫ్ పోటీల్లో అండర్- 17 (45-50 కేజీల) విభాగంలో బంగారు పతకం సాధించాడు. ఈ సందర్భంగా బుధవారం పత్తిపాడు మండలం యనమదలలోని కళాశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థి అభినందన కార్యక్రమంలో చైర్మన్ కోయి సుబ్బారావు మాట్లాడుతూ క్రీడల్లో రాణించడం వల్ల ఉపాధి అవకాశాలు సత్వరం లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి కోయి శేఖర్, డైరెక్టర్ గోగినేని సాంబశివరావు, పాలిటెక్నిక్ ఇంచార్జి పి.అప్పిరెడ్డి, పీడీ ఎం. సూర్యప్రకాశరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రామకోటయ్య పాల్గొన్నారు.

21న విద్యుత్ అదాలత్

పొన్నూరు: విద్యుత్ వినియోగదారుల ఫోరం (సీజీఆర్‌ఎఫ్) విజయవాడ ఆధ్వర్యంలో శనివారం విద్యుత్ అదాలత్, అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు బాపట్ల ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.అంజనేయులు బుధవారం ప్రకటనలో తెలిపారు. పొన్నూరులోని డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ విద్యుత్ కార్యాలయ ప్రాంగణంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు నిర్వహించనున్న సదస్సులో సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ జస్టిస్ ఎస్. విక్టర్ ఇమ్మానుయేల్, ఫోరం సభ్యులు, సూపరింటెండింగ్ ఇంజనీర్, గుంటూరు విద్యుత్ అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు. విద్యుత్ అంతరాయాలు, హెచ్చుతగ్గులు, మీటరు, బిల్లుల సమస్యల్ని అధికారుల దృష్టికి తీసుకురావచ్చని సూచించారు. విద్యుత్ వినియోగదారులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

చేబ్రోలు: ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి ప్రమాదానికి గురవటంతో యువకుడికి గాయాలైన సంఘటన చేబ్రోలు మండలం వడ్లమూడి గ్రామ పరిధిలో బుధవారం జరిగింది. మండల పరిధిలోని గొడవర్రు గ్రామానికి చెందిన బి. జోజి పనుల నిమిత్తం తెనాలి వెళ్లి బైక్‌పై తిరిగి స్వగ్రామానికి వస్తున్న సమయంలో వడ్లమూడి క్వారీ బ్రిక్స్ పరిశ్రమ ఎదురుగా బైక్ అదుపు తప్పి ప్రమాదానికి గురైంది. తలకు, కాళ్లు, చేతులకు గాయాలైన జోజిని 108 ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

సెయింట్ మేరీస్ విద్యార్థికి గాయాలు

చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో సెయింట్ మేరీస్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థికి బుధవారం గాయాలయ్యాయి. విజయవాడకు చెందిన కిరణ్ తేజ బైక్‌పై వస్తుండగా అదుపు తప్పి పంట కాలువలో దూసుకుపోయింది. కాలు విరిగిన కిరణ్‌తేజను 108 వాహనం ద్వారా గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భర్త ఆత్మహత్యపై పోలీసులకు ఫిర్యాదు

గుంటూరు రూరల్: భర్త ఆత్మహత్యపై భార్య నల్లపాడు పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. కొరిటిపాడు జీరో లైనులో రామానందం శివప్రసాద్ (40) భార్య శాంతితో కలసి నివాసం ఉంటున్నాడు. అతడు పలు బ్యాంకుల్లో రుణాలు ఇప్పిస్తూ ఉంటాడు. పలువురికి ష్యూరిటీ కూడా ఉన్నాడు. వారు నెలనెలా కిస్తీలు చెల్లించకపోవడంతో షూరిటీగా ఉన్న శివప్రసాద్‌కు బ్యాంకు అధికారులు నోటీసులు పంపించారు. రుణాలు తీసుకున్నవారిని చెల్లించాలని చెప్పినప్పటికీ వారు పట్టించుకోకపోవడంతో అప్పు ఇచ్చిన వారి నుంచి శివప్రసాద్‌కు ఒత్తిడి పెరిగింది. దీంతో ఇటీవల జేకేసీ కాలేజీ రోడ్డులో పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు అతడ్ని గుర్తించి చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. చికిత్స పొందుతున్న సమయంలో తాను ఆత్మహత్య చేసుకోవడానికి కారణం ముక్కామూడి కిరణ్‌కుమార్, శానం గోపాలకృష్ణ, దర్శనపు అశోక్ అని వీడియో రికార్డ్ చేశాడు. దీనిపై భార్య శాంతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి ఆత్మహత్యకు కారణమైన నిందితుల్ని వీలైనంత త్వరలో అరెస్టు చేస్తామని, కేసు దర్యాప్తులో ఉన్నట్లు సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో సంపూర్ణ ఆరోగ్యం

ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య

పెదకాకాని: కుటుంబమంతా సంపూర్ణ ఆరోగ్యంగా ఆనందంగా ఉండాలనే ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పేర్కొన్నారు. పెదకాకాని మండలంలోని వెంకటకృష్ణాపురంలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య సమస్యలు తెలుసుకోవడం, హెల్త్ క్యాంపుల ద్వారా స్పెషలిస్ట్ డాక్టర్లతో వైద్య సేవలు అందించడం, ఉచితంగా మందులు పంపిణీ చేయడం జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని వివరించారు. పేషెంట్ల సమస్య ఆధారంగా అవసరాన్ని బట్టి ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆసుపత్రులకు సిఫార్స్ చేస్తారని తెలిపారు. శిబిరాల్ని సద్వినియోగం చేసుకుని ప్రజలందరూ ఆరోగ్యంగా సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం వైద్య పరీక్షలు, పేషెంట్ల పేర్లు నమోదు, మందుల పంపిణీతో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పోషక విలువలతో కూడిన ఆహార పదార్థాల స్టాల్‌ను పరిశీలించారు. శిబిరం ద్వారా 415 మందికి వైద్యసేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఏర్పాట్లను పెదకాకాని పీహెచ్‌సీ సూపర్‌వైజర్ పి. శ్రీనివాసరావు పర్యవేక్షించారు. శిబిరంలో డాక్టర్ రామాంజిరెడ్డి, డాక్టర్ పి. ప్రవీణదీప్తి, డాక్టర్ అనూష, డాక్టర్ భవ్యశ్రీ పేషెంట్లకు వైద్యసేవలు అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎ. రామకృష్ణ, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, శివాలయం పాలకవర్గం చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, గ్రామ సర్పంచి దూళిపాళ్ల వెంకటేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు చాగంటి మురళీమోహన్‌రెడ్డి, సయ్యద్ సుభాని, పీఏసీఎస్ చైర్‌పర్సన్ భీమవరపు కోటిరెడ్డి, తోటకూర వెంకటేశ్వరరావు, సచివాలయ ఉద్యోగులు, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, వలంటీర్లు పాల్గొన్నారు.



వెంకటకృష్ణాపురంలో జరిగిన శిబిరంలో జగనన్న కిట్‌ను అందిస్తున్న వైద్య సిబ్బంది



పేషెంట్లకు అందిస్తున్న సేవలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య

నేడు ఉప్పలపాడులో జగనన్న ఆరోగ్య సురక్ష

పెదకాకాని: ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్యం చేకూరాలనే ఆశయంలో ప్రభుత్వం చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు కోరారు. మండలంలోని ఉప్పలపాడు జిల్లా పరిషత్ పాఠశాలలో గురువారం శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. వైద్య నిపుణులు ఉచితంగా పరీక్షలు చేసి మందులు పంపిణీ చేయడంతో పాటు కంటి పరీక్షలు కూడా చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామస్తులంతా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

ఆలయ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం



పనుల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య

పొన్నూరు: పట్టణంలోని శ్రీ సాక్షి భావన్నారాయణస్వామి దేవస్థానంలో పలు అభివృద్ధి పనులకు బుధవారం ప్రారంభోత్సవం చేశారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య దంపతుల్ని ఆలయ మర్యాదలతో అధికారులు, ధర్మకర్తల మండలి సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. ఆలయ ప్రాంగణంలో రూ. 65 లక్షలతో (సీజీఎఫ్ ఫండ్, దాతల సహకారం) నూతనంగా నిర్మించిన కల్యాణ మండపం, హోమ, యాగ, ప్రసాదశాల, బుకింగ్ కౌంటర్‌లను ఎమ్మెల్యే రోశయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆర్. రమణమ్మ, ఆలయ అధికారులు శ్రీనివాస్, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, నాగసూరి ప్రతాప్, మైనార్టీ కమిషన్ సభ్యులు షేక్ సైపుల్లా, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఎం.ఏ. మహమ్మద్, నాయకులు, బొద్దులూరి రంగారావు, ఆలయ అర్చకులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

రైతులకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం

పెదకాకాని: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య అన్నారు. పెదకాకాని మండలం వెంకటకృష్ణాపురం గ్రామ శివార్లలో బుధవారం వరి పైర్లను, కాలులలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు ఆయన్ను కలిశారు. కాలువల ద్వారా సాగునీరు విడుదల చేయాలని, వరి పొలాల్లో నీరు లేదని తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య మాట్లాడుతూ త్వరలోనే పంట కాలువలకు సాగునీరు విడుదల చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలోఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి, శివాలయం పాలకవర్గం చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, తోటకూర వెంకటేశ్వరరావు, కానుగోలు శంకరరావు పాల్గొన్నారు


వైఎస్సార్ సీపీ కార్యకర్త కుటుంబానికి ఆర్థిక సహాయం

పొన్నూరు: పట్టణంలోని 13వ వార్డుకు చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త ప్రవీణ్ కుమార్ (జోషి) ఇటీవల అనారోగ్యంతో మరణించారు. పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య బుధవారం జోషి నివాసంలో కుటుంబ సభ్యుల్ని పరామర్శించారు. రూ.10 వేలు ఆర్థిక సహాయం చేసి కుటుంబ సభ్యులలో ఒకరికి ఉద్యోగ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ సభ్యులు షేక్ సైపుల్లా, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పెరికల కృష్ణమోహన్, రాష్ట్ర ఇరిగేషన్ శాఖ డైరెక్టర్ దాసరి నారాయణరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, బొద్దులూరి రంగారావు, జేసీఎస్ కన్వీనర్ అమిరినేని సాంబశివరావు, వైఎస్సార్ సీపీ రూరల్ అధ్యక్షుడు రుద్రపాటి ఆది శేషులు, గ్రామ సర్పంచులు, వార్డు నాయకులు వేముల మూర్తి రాజు, మంద్రు వెంకటరత్నం, యాతాటి చంద్రమౌళి పాల్గొన్నారు.

వరములిమ్ము వరలక్ష్మి.. సిరులివ్వు శ్రీలక్ష్మి



నంబూరులో శ్రీలక్ష్మీ దేవిగా..



శలపాడులో శాకంబరీ దేవీగా..



కొత్తరెడ్డిపాలెం ఆనందాశ్రమంలో అన్నపూర్ణాదేవిగా..

పెదకాకాని: దసరా పర్వదినం సందర్భంగా శ్రీదేవీ నవరాత్రోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మండలంలోని ఆయా గ్రామాల్లో అమ్మవారి విగ్రహాలను పందిళ్లలో అలంకరించి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహిస్తున్నారు. వెనిగండ్లలో శ్రీలలితా త్రిపురసుందరీదేవిగా, నంబూరు ఎస్‌బీఆర్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పందిరిలో శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారిని బుధవారం శ్రీలక్ష్మీదేవిగా అలంకరించి పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. అర్చకులు గోత్రనామ పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

శాకంబరీ దేవీగా దుర్గామాత

శలపాడు(చేబ్రోలు): మండలంలోని వివిధ గ్రామాల్లో దసరా శరన్నవరాత్రులలో భాగంగా దుర్గాదేవీ అమ్మ వారు ప్రత్యేక అలంకారంలో బుధవారం దర్శనమిచ్చారు. శలపాడులో దుర్గా భవానీ ఫ్రెండ్స్ సర్కిల్ యూత్ ఆధ్వర్యంలో 17వ వార్షిక వేడుకలను నిర్వహిస్తున్నారు. జగన్మాత దుర్గాదేవి అమ్మవారు శాకంబరీ దేవీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. చేబ్రోలులోని నాగేశ్వరస్వామి దేవస్థానంలో పార్వతీదేవీ అమ్మవారు ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చారు. కొత్తరెడ్డిపాలెం ఆనందాశ్రమంలో గాయత్రీదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నపూర్ణాదేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

పొన్నూరు: పట్టణంలో శ్రీదేవి శరన్నవరాత్రుల మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. కార్యక్రమాల్లో భాగంగా నాలుగో రోజు అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని ఎనిమిదో వార్డులో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వేదికపై అమ్మవారిని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

అంతరిక్ష పరిశోధనల్లో ఇస్రో కీర్తి విశ్వవ్యాప్తం



కార్యక్రమంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త జగన్మోహనరావు

గుంటూరు రూరల్: అంతరిక్ష పరిశోధనల్లో ఇస్రో కీర్తి విశ్వవ్యాప్తంగా చాటుకుందని ఇస్రో మాస్టర్ కంట్రోల్ ఫెసిలిటీ విభాగం సైంటిస్ట్ జి. జగన్మోహనరావు పేర్కొన్నారు. చౌడవరంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన ఇండియన్ స్పేస్ ప్రోగ్రాం ప్రజంట్ ఫ్యూచర్ అనే అంశంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇస్రోలో సేవలందించేందుకు విద్యార్థులు శాస్త్రవేత్తలుగా తయారయ్యే దిశగా కృషి చేయాలని తెలిపారు. భారతదేశంలో వివిధ ప్రాంతాల్లో నెలకొల్పిన కేంద్రాల్లో ఇస్రో పరిశోధనలు, శాటిలైట్స్ ప్రయోగాలు పనితీరు, వాటి వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులు శాస్త్రవేత్తలు గా తయారయ్యేందుకు అనుసరించాల్సిన విద్యావిధానాన్ని ఆయన తెలియజేశారు. దేశాభివృద్ధే లక్ష్యంగా అంతరిక్ష విజ్ఞానాన్ని అభివృద్ధి చేసే ఉద్దేశంతో ఏర్పాటైన ఇస్రో అనేక పరిశోధనల్లో విప్లవాత్మక విజయాలను సాధించిందని పేర్కొన్నారు. ప్రపంచంలోని అగ్రగామి అంతరిక్ష రంగ సంస్థల్లో ఒకటిగా పేరుగాంచినదని తెలిపారు. భవిష్యత్‌లో జరుపనున్న గగన్‌యాన్, చంద్రయాన్- 4, లుపెక్స్, శుక్రయాన్, మంగళ్యాన్- 2, ఎక్స్‌పో సట్, నిస్సార్, స్పాడెక్స్ తదితర ఉపగ్రహ ప్రయోగాల విజయాలే ఇస్రో ముందున్న తదుపరి లక్ష్యమని ఆయన తెలిపారు.

అమెరికా, రష్యా దేశాల నుంచి దిగుమతి చేసుకున్న రాకెట్లను ప్రయోగించే స్థాయి నుంచి అనతికాలంలోనే భారతదేశం స్వదేశీయంగా పూర్తిస్థాయిలో తయారు చేసి, ఉపరితల అధ్యయనంలో పురోగతి సాధించడం గర్వకారణమని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్. శ్రీనివాస్, సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్. గోపాలకృష్ణ తెలిపారు.శాస్త్రవేత్తగా ఇస్రోలో సేవలందిస్తున్న జగన్మోహన్‌రావు తమ కళాశాల పూర్వ విద్యార్థి కావడం గర్వకారణమని ట్రెజరర్ డాక్టర్ కె. కృష్ణ ప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె. రవీంద్ర, ఏవో డైరక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాస్, డాక్టర్ టి. రంగబాబు పాల్గొన్నారు.

కిట్స్‌లో విద్యార్థుల అమృత కలశ యాత్ర



అమృత కలశయాత్రను నిర్వహిస్తున్న నెహ్రూ యువ కేంద్రం జిల్లా యూత్ ఆఫీసర్ కిరణ్మయి దేవిరెడ్డి

గుంటూరు రూరల్: ప్రతి ఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలని నెహ్రూ యువ కేంద్రం డిస్టిక్ యూత్ ఆఫీసర్ కిరణ్మయి దేవిరెడ్డి తెలిపారు. వట్టిచెరుకూరు మండలం వింజనంపాడులోని కిట్స్ కళాశాలలో బుధవారం భారత ప్రభుత్వ యువజన వ్యవహారాల క్రీడా మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు అమృత కలశ్ యాత్రను నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల ద్వారా మట్టిని, ధాన్యాన్ని సేకరించి కాకినాడ జేఎన్‌టీయూ ఎన్ఎస్ఎస్ యూనిట్ ద్వారా భారత ప్రభుత్వ యువజన క్రీడా మంత్రిత్వ శాఖకు అందించనున్నట్లు చెప్పారు. న్యూఢిల్లీలో అక్టోబర్ నెల చివరి వారంలో స్వామి వివేకానంద విగ్రహం వద్ద సేకరించిన మట్టిని, బియ్యాన్ని సమర్పించనున్నట్లు తెలిపారు. అనంతరం పంచప్రాణ ప్రతిజ్ఞను నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా బ్యాంక్ లీడ్ మేనేజర్ మణిపాల్‌రెడ్డి, కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు, కార్యదర్శి కోయి శేఖర్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, డైరెక్టర్ డాక్టర్ కె. హరిబాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కె. చంద్రారెడ్డి పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు చిరస్మరణీయం

నెహ్రూనగర్: స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు చిరస్మరణీయమని గుంటూరు జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ మణిపాల్‌రెడ్డి పేర్కొన్నారు. నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ ఆధ్వర్యంలో బుధవారం ఉమెన్స్ కాలేజీలో మేరీ మాటి- మేరే దేశ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కాలేజీలో మట్టిని సేకరించి, కుండల్లో భద్ర పరిచారు. ఈ సందర్భంగా మణిపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఇంటింటికీ వెళ్లి సేకరించిన బియ్యం, మట్టిని ఢిల్లీలో అక్టోబర్ నెల చివరి వారంలో నిర్వహించబోయే జాతీయ స్థాయి కార్యక్రమంలో స్వామి వివేకానంద విగ్రహం వద్ద సమర్పించనున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్ర సంఘటన్ జిల్లా కో-ఆర్డినేటర్ కిరణ్మయి దేవిరెడ్డి, ఉమెన్స్ కాలేజీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సంతోషకుమారి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

స్కేటింగ్‌లో చిన్నారి సోఫియా ప్రతిభ




గుంటూరు ఎడ్యుకేషన్: ఎల్ఐసీ కాలనీలోని విజ్ఞాన్ పాఠశాలలో 3వ తరగతి చదువుతున్న చిన్నారి నెలటూరి సోఫియా స్కేటింగ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ పతకాలు సాధిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శ్రీనివాస్ బుధవారం తెలిపారు. రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో జరిగిన స్కేటింగ్ పోటీల్లో బంగారు, వెండి పతకాలు సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. సోఫియా తండ్రి రవి కుమార్ రన్నింగ్ అథ్లెటిక్‌గా ఉన్నారని, కూతురులోని ప్రతిభను ఆయన గుర్తించి మంచి శిక్షణ ఇప్పించడంతో నేడు పతకాలు సాధించిందని వివరించారు. ఈ సందర్భంగా సోఫియాకు విజ్ఞాన్ సంస్థల అధినేత డాక్టర్ లావు రత్తయ్య, ఉపాధ్యక్షుడు, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అభినందనలు తెలిపారు.

ఆన్‌లైన్‌లో సొమ్ము స్వాహా

పట్నంబజారు: ఆన్‌లైన్‌లో మోసం చేసి నగదు దోచుకున్న ఘటనపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చౌత్రా సెంటర్‌కు చెందిన అన్నవరపు పవన్‌కుమార్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పని చేస్తున్నారు. ఈనెల 11న టెలిగ్రామ్ యాప్‌లో స్టాక్ మార్కెట్ ఇన్వెస్ట్‌మెంట్‌కు సంబంధించి యాప్‌ను ఓపెన్ చేశారు. వారు సూచించిన విధంగా పెట్టుబడి పెడితే లాభం వస్తుందని నమ్మబలికిన నేపథ్యంలో రూ. 2.38 లక్షలు చెల్లించారు. సదరు యాప్‌కు సంబంధించిన వ్యక్తులు స్పందించకపోవడంతో మోసపోయినట్లు గుర్తించి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సవాళ్లను అధిగమించాలి

పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ చీఫ్ జనరల్ మేనేజర్ బి.ఎం. పట్నాయక్



చేబ్రోలు : దేశ పురోగతికి ఆటంకం కలిగించే సవాళ్లను అధిగమించి అభివృద్ధి వైపు పయనించాలని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ చీఫ్ జనరల్ మేనేజర్ బి.ఎం. పట్నాయక్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో ద రోల్ ఆఫ్ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ - ద జర్నీ అండ్ ఫ్యూచర్ ఎక్స్‌పెక్టేషన్స్ ఫర్ వికాసిత్ భారత్- 2047 అనే అంశంపై బుధవారం ప్రత్యేక అతిథిగా ఆయన మాట్లాడారు. 2047 నాటికి భారతదేశం ఆర్థికవృద్ధి, సామాజిక, సాంకేతిక పురోగతి, స్థిరమైన అభివృద్ధి కోసం స్పష్టమైన లక్ష్యాలను నిర్దేశించడం ద్వారా యువత చురుకుగా పాల్గొనడానికి రోడ్‌మ్యాప్‌ను ఏర్పాటు చేసుకోవాలన్నారు. నాణ్యమైన విద్య, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, వృత్తి శిక్షణకు ప్రాధాన్యమివ్వాలని తెలిపారు. ఒక దేశం అవినీతి రహితంగా, అందమైన మనస్సులతో కూడిన విధంగా మారాలంటే తల్లి, తండ్రి, గురువు అనే ముగ్గురు కీలకమైన సభ్యులతో సమాజంలో మార్పును తీసుకురావచ్చని సూచించారు.